సీతాపహరణం

రామ్‌చంద్

అనగా అనగా రాముడనే వాడున్నాడు. అతను ఆ గర్భ శ్రీమంతుడు. ఆడింది ఆటగా, పాడింది పాటగా, ఒక్కగా ఒక్క కొడుకవటంవలన, వాడు చేసిందల్లా చెల్లుతున్నది ఇంట్లో, (చేసిందంటే మరేం లేదనుకోండి, స్నేహితుల్ని పోగుచేసి సినిమాలకు, షికార్లకు, కాఫీ హోటళ్లకు డబ్బు తగలెయ్యటం, సిగరెట్లు కాల్చటం, బడి ఎగ్గొట్టి ఆడుతూ పాడుతూ కాలం వెళ్ళబుచ్చటం మాత్రమే) పుట్టి పెరిగినవూళ్లో ఎక్కువ చదువులు లేకపోవటంవలన, వాడ్ని పట్నం పంపించారు తల్లిదండ్రులు, చదివి ఏదో వెలగపెట్టాడని. కొంత కాలం వాడు పట్నంలో మేనమామగారింట్లో మకాం వేశాడు. తర్వాత తన దినచర్యకు మేనమామగారు అడ్డవటం వలన, వేరేరూమ్ అనేది తీసుకొని తనకు దూరపు చుట్టమూ సహాధ్యాయి అయిన లక్ష్మణుడితో కలిసి హాయిగా కాలాన్ని వెళ్లబుచ్చసాగాడు. ఆనాడు రాముడికి హనుమంతుడివలె ఈనాడు ఈ రాముడికి లక్ష్మణుడు నమ్మిన బంటు.

ఇంట్లో వాళ్ల పోరువల్లనైతేనేం, ప్రోద్బలం వల్లనైతేనేం, మాస్టర్ల చేతి దెబ్బవల్లనైతేనేం, మెట్రిక్యులేషన్‌వరకూ ఎట్లాగో రాముడు నెట్టుకుంటూ వచ్చాడు. కాని, ఆ మెట్రిక్యులేషన్ పరీక్ష వంపు లేకుండా సాఫీగావున్న తన జీవితబాటలో ఓ పెద్ద గండీ అయిందని పరీక్షలు కొద్దిరోజులున్నాయనగా తెలుసుకున్నాడు.

పట్నంలో రాముడుకి ఓ మేనమామ ఉన్నాడన్నాంకదూ; ఆయన పేరు భద్రంగారు. సీత, ఆయనకుమార్తె. పదహారేళ్ల సీతకు, పదహార్ను ఓ తొమ్మిది పాతికేళ్ల రాముడుకు మధ్య ప్రణయం రేగింది, అయితే ఆ ప్రణయం ఎటువంటి ప్రళయానికీ దారితీయక వారి హృదయాల్లోనే మునిగి, కేవలం ఒకర్నొకరు చూసుకున్నప్పుడు కళ్ళతో మాట్లాడుకోవటంతో ఆగిపోయింది. వాళ్లిద్దరి పెళ్ళి తన కళ్లముందే జరిగితే హాయిగా ఏ విచారమూ లేకుండా కళ్లు మూస్తానంటుంది భద్రంగారి తల్లిగారైన పార్వతమ్మగారు; కాని పిల్లకు ఏమంత ఈడుందని అప్పుడే పెళ్లంటావు అంటాడు భద్రంగారు.

భద్రంగారు సంస్కారి; స్త్రీ విద్య తన ఇంటిని సంస్కరించటానికి తొలిమెట్టని ఆయనకు ఘట్టి నమ్మకం. ఆయన తన నమ్మకాన్ని ఒట్టిదే కానివ్వడనటానికి సాక్ష్యం సీత చదువు. ఆయన సీతను చదివిస్తున్నాడు, ఇంట్లోవాళ్లు "మనవంటివాళ్లకు తగనిదని" ఎంతగా చెప్పినా వినక. సీత రాముడు



ఔలో రష్యా లలితకళా ప్రదర్శనంలో జానపదకళకు సంబంధించిన అల్లిక పనితనం. (ఫొటో: ఎమ్. ఓజెర్‌స్కీ)

★ సీతాపహరణం ★

చదువుతున్న స్కూళ్లోనే మిటిక్లేషన్ చదువుతున్నది.

పరీక్షలు దగ్గిరపడ్డాయి...ఆరోజుగడిస్తే పరీక్షలు.

* * *

పడకకుర్చీలో పడుకొని సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ, ఆలోచనల్లో అఘోరిస్తున్న రాముడు, ఇంజన్ కూతలాంటి పెద్ద ఆవలింతతో గది నావరించిన నిశ్శబ్దాన్ని చీల్చి చెండాడాడు. రాత్రల్లా నిద్ర లేదు; రెండు కప్పుల ఓవల్టిన్, మూడు చపాతీలు (బంగాళా దుంపలకూరతో సహా), మరో గ్లాసుడు టీ తప్ప అన్నం ఏమాత్రంగూడా ముట్టలేదు పాపం. పరీక్షలు మరునాడే ప్రారంభం, మరేం చెయ్యాలి అనేదే సమస్యై వేధిస్తున్నది. ఆలోచన ఎంతకూ తెగటంలేదు సమస్య పరిష్కారం కావటంలేదు. తను ప్యాసవుతాననే ధైర్యం ఏనాడో అడుగంటింది అతనిలో. ఇహ చదివి మాత్రం లాభంలేదని ఇన్నిరోజులు హాయిగా సినిమాల్లోనూ, బీచి షికార్లతోనూ కాలం గడిపాడు. కాని ఉన్నట్లుండి, రేపు పరీక్షనగా ఇవాళ తనకు "పరీక్షయి తీరాలి" అని పుట్టింది. పుట్టటమేమిటి పుస్తకాలన్నీ ఒక్కసారి తిరిగేశాడు, కాని ఏనాడైనా వాటిని ముట్టుకున్న పాపాన పోతేగా, అవి అర్థమై చావటానికి. ఎలాగైనా తను ప్యాసై తీరాలి; కాని అవటానికి అణుమాత్రం గూడా అవకాశంలేదు. కాపీచేయటం పాపమనని అతని ఉద్దేశ్యం. మరేదో ఒకటిచేయాలి. ఆ చేయాల్సిన ఒకటి ఏమిటనేదే ప్రశ్న.

అంతవరకూ దూరంగా కిటికీ వద్ద కూర్చొని వివిధమానవుల్ని చూడటంలో నిమగ్నుడైన లక్ష్మణుడు చిటిక వేసి, ఎగిరి గంతు వేశాడు. "యురేకా-యురేకా (కనుగొంటిని, కనుగొంటిని) అని అరుస్తూ.

రాముడు పడక కుర్చీలోనుంచి త్రుళ్లిపడి లేచాడు, అంతవరకు లక్షణంగా వున్న లక్ష్మణునికి ఇంతలోనే ఏమైందా అనుకుంటూ; అసలే చిరాకుగా వున్నాడాయె పరాకుతో, లక్ష్మణునపై అమాంతం కోపం వచ్చేసింది, "యురేకా ఏమిట్రా నీబొంద," ఆర్కి మెడిస్ అవుగామనుకున్నావేంటి! విసురుగా కసిరాడు.

"ఆర్కిమెడిస్ అంటూ ఆ అప్రాచ్యుడి పేరెత్తుతావెందుకు! ఆ వెధవ పుట్టబట్టేగా ఈ ఫిజిక్స్ అవతరించి మన ప్రాణాలు తీస్తున్నది పరీక్ష ప్యాసవనీయకుండా," పకపక నావ్వాడు లక్ష్మణుడు.

"మొత్తుకున్నట్లే వుంది ఆ ఎత్తుపళ్ళు బయటబడుతూ నీనవ్వూ నీవూనూ, మిత్రుడు అన్నాహారాలు లేకుండా నానా అవస్థలు పడుతుంటే నీకు నవ్వుగానే వుంటిదిరా," అంటూ ముఖం మాడ్చుకున్నాడు రాముడు.

రాముడు మాటలు లక్ష్మణుడి తలలో దూరినట్లు లేదు. అతని సంతోషమేమో, అతడేమో. గంతులేస్తూనే, "యురేకా," అన్నాడు మళ్లీ.

రాముడు మండిపొయ్యాడు. కోపంతో అతని తాపం అంతింతై, అల్లంతై, ఆ సమయంలో ఆలోచన చెప్పే మిత్రుడు లక్ష్మణుడు తప్ప మరొకడెవడూ లేకపోవటం వలన చప్పున చల్లారి వూరుకొంది. అయినా అతనికి సంపూర్ణ స్వేచ్ఛ నివ్వటం తన ఆత్మగౌరవానికే భంగం అనుకుంటూ, యురేకా లేదు, శశిరేఖా లేదు...నోర్ముయ్యనోయ్ వెధవ వాజమ్మ," అని గదిమాడు.

"శశిరేఖ కాదురా పిచ్చినాయనా నీ జీవితరేఖరా...సీత...సీత తెలియదా" ఎక్కిరింపుగా కొక్కిరించాడు లక్ష్మణుడు.

"సీత! సీత పేరెత్తావంటే వాతపెట్టా నోటిమీద...జాగ్రత్త...ఎవరన్నా వింటారని గూడా లేదు..." చీవాట్లు వేస్తూనే చరచరా వెళ్ళి పడకకుర్చీలో మళ్ళీ పడుకొని మౌనం వహించాడు. సీత పేరు వినగానే అతని ఆత్మ ఆవురుమంది; బావురుమని ఏడ్వాలనుకున్నాడు. కాని ఇంటివాళ్ళు వెళ్ళిపొమ్మని నోటీసు ఇస్తారేమోననే భయంతో మౌనంలో మునిగిపోయాడు.

రాముడు మౌనాన్ని చూచి లక్ష్మణుడు నిలువునా నీరయ్యాడు. కొయ్యబారిపోయేవాడే గాని రాముడు హృదయంలో రేగిన అగ్నిమంటల్ని ఆర్పటం ప్రాణమిత్రుడైనతన ధర్మం కాబట్టి, మెల్లిగా పిల్లిలా అడుగులో అడుగు వేసుకుంటూ రాముడివద్దకు వెళ్ళి, ముక్కాలిపీట లాక్కొని అతనిదగ్గరగా కూర్చున్నాడు. రాముడు ఉలక లేదు పలుకలేదు. లక్ష్మణుడు ఓదార్పుగా అతని భుజం మీద చేయివేసి "ఊరుకోరా బాబూ" అన్నట్లు తట్టాడు.

అంతవరకూ కళ్ళు మూసుకొని సీతాధ్యానంలో మునిగివున్న రాముడు ఒక్కసారి కళ్లు తెరచి ప్రక్కనే కూర్చున్న లక్ష్మణుని కళ్లల్లోకి నీళ్లు నిండిన తన కళ్లతో చూసి, అతని చేతిని తన చేతిలోకి తీసుకొని, "లక్షూ, గుండె పుండైందిరా. నా గతి ఇంత అధోగతికి దిగుతుందని అనుకోలేదు. ఒకటే దాహం వేస్తున్నది," అన్నాడు.

లక్ష్మణుడికి జాలివేసింది. "ఉండరా నాయనా, ఐస్ క్రీం సోడా తెప్పిస్తాను, దాహం దానంతటదే తీరుతుంది" అన్నాడు.

"సోడాలతో షర్బత్తులతో తీరేది కాదురా ఈ దాహం. కడుపులో మంటలు రేగాయి. గుండె దడదడలాడుతున్నది చూడు," అంటూ లక్ష్మణుడి చేతిని తన గుండెకు హత్తుకొని, "నీవు నా ప్రాణస్నేహితుడివి. నా ఆంతరంగిక కార్యదర్శివి. నీకూ నాకూ మధ్య ఎటువంటి రహస్యాలు లేవు. నీ కెన్నో సార్లు కాఫీటిఫిన్ ఇప్పించాను; సినిమాలకు తీసుకువెళ్ళాను; అప్పుడప్పుడు నా గుడ్డలు అరువిచ్చాను; నాకీ సమయంలో మంచి ఆలోచన చెప్పి సాయం చెయ్యరా బాబూ; ఈ విపత్కర విపరీత పరిస్థితిలో మార్గమేమిటో అర్థం గావటం లేదు. బరువుతో నా మనస్సు అరుస్తున్నది. మార్గాంతరం చెప్పరా" అంటూ కంటికి మింటికి ఏకధాటిగా కన్నీరు కార్చి, మూర్ఛపోయాడు రాముడు.

రాముడు మూర్ఛపోవటంతో లక్ష్మణునికి మతిపోయినంతపనైంది. 'సంజీవి' తీసుకురండ్రా అని కేకేశాడు, గ్లాసు అందుకుంటూ. సమయానికి ఇల్లు ఊడ్చే మనిషి హనుమంతుడల్లే తయారైంది చీపురు కట్ట పుచ్చుకొని. లక్ష్మణునికి ఎక్కడలేని బలం వచ్చింది దాన్ని చూడగానే. రాముడి జేబులు తడిమి పావలా కాసు బయటకుతీసి



లల్లూరాం అండ్ కో

(స్థాపితము 1928.)

ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధిచెందిన

* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు

* క్యాషు బాక్సులు

లల్లూరాం అండ్ కో

వెలగలేటివారి వీధి, : : విజయవాడ - 1.

"క్రొత్త షోరూమ్ - మారుతి సినిమా కెదురుగా."

గ్లాసు ఇచ్చి "వెళ్ళి, వెంటనే రెండు కప్పులు స్ట్రాంగు కాఫీ తీసుకురమ్మని పురమాయించాడు.

పొంగుచ రెండు అంగల్లో వీధిచివరవున్న కాఫీహోటలుకువెళ్ళి కాఫీ తెచ్చింది పనిమనిషి;

కాఫీ చూడగానే లక్ష్మణుడికి రాముడి ప్రాణం వచ్చినంత సంతోషం వేసింది. గబగబా ఫ్లాసులోని కాఫీని రెండు గ్లాసుల్లో వంపి, ముందు తనో గ్లాసు ఖాళీచేసి రెండో గ్లాసు తీసుకొనివెళ్ళి రాముడు నోటివద్ద పెట్టాడు. సెగలుకొట్టే కాఫీపొగ రాముడి నాసికారంధ్రంలో గుండా ప్రవేశించి వాడి బుర్రను ఒక్క తన్ను తన్నింది; అమాంతంగా లేచికూర్చుని, ఒక్క గుక్కతో గ్లాసు ఖాళీచేశాడు రాముడు.

"అరే రాముడూ, నీవు ఏడుస్తుంటే నాకూ ఏడ్వాలనిపిస్తున్నదిరా, అయినా నీవిక ఏడ్వాల్సినపని లేదు. నాకో గొప్ప ఆలోచన తట్టిందిరా," అన్నాడు లక్ష్మణుడు.

"ఆ...ఆ...నిజంగా!...నీవంటే నీవేరా తమ్ముడూ....చప్పున చెప్పరా బాబూ చంపక అదేంటో నీకు పుణ్యముంటుంది," ఆశతో లేచికూర్చున్నాడు రాముడు.

"చెప్తారా," అంటూ రాముడు చెవిలో నోరు పెట్టి ఏమేమిటో గొణిగాడు లక్ష్మణుడు.

రాముడికి ఎక్కడలేని బలం వచ్చింది. వేడెక్కిన అతిబుర్ర చల్లబడింది. వేగంగా కొట్టుకుంటున్న గుండెదడ తగ్గింది. ఉత్సాహంతో కుర్చీనుండి లేచి నిలబడ్డాడు. సంతోషంతో లక్ష్మణుడివీపుమీద బలంగాగుద్ది, నొప్పి పుట్టుందని గూడా లేకుండా "థాంక్స్‌రా" అంటూ వాడిచేతిని నలిపేశాడు.

"అబ్బ వుండ్రా, చేయి నొప్పిపుట్టున్నది...ఇహ ఈ అర్థ నిరశనవ్రతాలు చాలుగాని పద వెళ్ళి భోంచేద్దాం," అన్నాడు లక్ష్మణుడు.

"లేదురా భాయీ, ఇది అటో ఇటో తేలేవరకూ అన్నం ముట్టుకోవటమనేది వట్టిమాట," అన్నాడు రాముడు ధీమాగా.

"కర్మ సరే ఏం చేస్తాం....పద కాఫీ దేవాలయానికి; ఏనాడో ఆ సాంబారు మనకు ఋణం వుంది. మనం వాడికి డబ్బులు బాకీ వున్నాం," అంటూ లక్ష్మణుడు హోటలుకు దారితీశాడు.

* * *

ఆరోజు గడిచిపోయింది. మరునాడు అరుదెంచింది. ఆ రాత్రల్లా అటు రాముడు ఏమౌతుందోనని తెగ ఆలోచిస్తూ కన్ను మూయలేదు. ఇటు సీతకు పరీక్ష బెదురుతో అసలు కునుకనేదే లేదు.

ఆనాడు పరీక్ష...సీతారాములకు పరీక్ష.

* * *

"సీతింకా రాలేదేం చెప్మా," పచ్చీసు పావులు ఎత్తుతూ అంది అన్నపూర్ణమ్మగారు.

"పరీక్షలు కదూ, ఆలస్యమై వుంటుంది" అంది పొరుగింటావిడ లేస్తూ. "కొంచెం ఆలస్యమైతే అంత గాభరాపడతావెందుకే; అయినా ఈడేరిన పిల్లకు ఈ చదువులేంటి, మా కాలంలో ఎరుగమమ్మా ఆ మూడు ముళ్లూ ఏదో నా కళ్ళముందే వేయించరా అంటే వాడు వింటేగా. ఏమిటో ఈ కాలం, కలికాలం.... పదహారేళ్లొచ్చినా పిల్ల పెళ్ళిమాటే తలపెట్టరుగదా," సణిగింది పార్వతమ్మగారు.

"అమ్మాయి వచ్చిందటే, పరీక్ష ఎలా రాసిందో," ఏదో పనిమీద బయటకు వెళ్ళిన భద్రంగారు ఇంట్లో కాలు పెడుతూనే అడిగారు. ఆయన రావటంచూసి పొరుగింటావిడ తనింటికి వెళ్ళిపోయింది.

"ఇంకా రాలేదండి, ఈపాటికి రావల్సింది," అంది అన్నపూర్ణమ్మగారు భయభయంగా.

"ఇంకా రాకపోవటమేమిటి, టైమై చాలా సేపయితే!" భద్రంగారి ముఖంలో ఆశ్చర్యరేఖలు అవుపించాయి.

"ఆ, ఎవరైనా స్నేహితురాలింటికి వెళ్లిందేమో వస్తూవస్తూ," అంది ముసలమ్మ.

"ఏ స్నేహితురాలైనా మనింటికి రావల్సిందేగాని అది ఎవరింటికీ వెళ్ళదండీ," అంది అన్నపూర్ణమ్మగారు.

"మరేమైనట్లు"

"అదే తెలియటంలేదు," అంది అన్నపూర్ణమ్మగారు దిక్కుముఖం పెట్టి.

వాళ్ళిలా మాట్లాడుకుంటూ వుండగా, బయటనుండి, "సీతా," అని కేక వినిపించింది.

"నేనేనండి," అంటూ సీత స్నేహితురాలు అనసూయ గుమ్మంలో కొచ్చి, ఎదురుగా కుర్చీలో కూర్చున్న భద్రంగారిని చూచి తలుపుచాటుకు తప్పుకుంది.

"పరవాలేదు రామ్మా, ఎవరున్నారు," అంటూ బయటకువెళ్ళి, అనసూయను లోపలికి తెచ్చింది అన్నపూర్ణమ్మగారు.

"సీత లేదండీ?" అడిగింది అనసూయ.

"పరీక్షకు వెళ్లిందమ్మా ఇంకా రాలేదు. అదే అనుకుంటున్నాం. ఎప్పుడూ ఆలస్యమనేది ఎరుగదు," అంది అన్నపూర్ణమ్మగారు; కూతురు ఎక్కడికి వెళ్లిందో ఏమిటో అనే దిగులు వణుకుతున్న ఆమె కంఠంలో మిణుకుమంది.

"పరీక్షకు వెళ్లిందా!...రాలేదండీ; ఎందుకు రాలేదో ఏమిటో కనుక్కుందామని వచ్చానండి," అంది అనసూయ అర్థంగాక.

"పరీక్షకు రాలా! మరి ఏమైనట్లు?" భద్రంగారికి అగమ్యంగావుంది.

"నా తల్లి ఏమైందో, మీరింకా కూర్చున్నారేం. 'వెళ్లి చూడండి," [illegible] అందుకుంది అన్నపూర్ణమ్మగారు.

"వెళ్లి పోలీసు రిపోర్టివ్వండి, పరీక్షకు రాకుండానూ, ఇంట్లో లేకుండాను మరి ఏమైనట్లు," అనసూయ సలహాయిచ్చింది.

"ఏమని రిపోర్టివ్వను," రుద్ధకంఠంతో అడిగాడు భద్రంగారు.

"పిల్ల తప్పిపోయిందనివ్వండీ," అంది అన్నపూర్ణమ్మగారు కండువా తెచ్చి ఆయనకిస్తూ.



★ సీతాపహరణం ★

"తప్పిపోవటానికి అదేమైనా చిన్న పిల్లలే," దెప్పిపొడిచింది పార్వతమ్మగారు; పిల్లకు చదువొద్దో అని ఎంత మొత్తుకున్నా విననందుకు తగిన పనే అయిందనుకొంటూ.

"నీ వుండవమ్మా...ఎప్పుడేం మాట్లాడాలో తెలియదు," అంటూ, "గాభరా పడకండి నే నిప్పుడే వస్తాను," అని బయలు దేరాడు భద్రంగారు.

ఎదురుగా కొత్త క్యాలెండరు మీద "సీత నెత్తుకొని వెళ్తున్న రావణాసురుడి బొమ్మ"ను చూస్తూ, సీతాపహరణం," అని మనస్సులో అనుకొని ఓ వేడి నిట్టూర్పు విడిచి, "మళ్లీ వస్తానండి" అంటూ వెళ్ళిపోయింది అనసూయ.

* * *

మైక్ ముందు నిలబడివున్న కథకుడు అయిపోయిందన్నట్లు ఆవులించాడు 'హ్హా' అని.

"అదేంటయ్యా, అసంపూర్తి కథ చెప్పి వెళ్తానంటావు? ఆ సీత ఏమైంది? అంతకు ముందు చెప్పిన రాముడేమయ్యాడు? లక్ష్మణ మంత్రాంగం ఏమిటి?" అంటూ పలువురు శ్రోతలు ప్రశ్నల వర్షం కురిపించారు.

"నేను చెప్పుతానన్నది సీతాపహరణమే ...అదే చెప్పేశాను..." అన్నాడు కథకుడు.

"ఏడ్చావ్—ఆ మిగిలిందిగూడా ఏడ్చి మరి పో," అన్నాడో శ్రేతుకుడు.

"నేను ఏడ్వటానికేం రాలేదు, కథ చెప్పటానికి వచ్చాను, చెప్పేశాను. మీ రింకా ఎంత ఏడ్చి మొత్తుకున్నా లాభం లేదు, నాకు నిద్రవస్తున్నది," హ్హీహ్హీహ్హీ అని నవ్వి, వెళ్లటానికి ఒక్క అడుగు ముందుకు వేశాడు కథకుడు.

"కాలు కదిపావా, ఒళ్లు హూనమౌతుంది జాగ్రత్త. కథ పూర్తిచేసిపో..." ఉద్రేకంతో అన్నారు శ్రోతలు.

"నా ఇష్టం...నా ఇష్టమైతే చెప్తాను కష్టమైతే మానేస్తాను. మధ్య మీరెవరు నన్ను ప్రశ్నలు వేయటానికి. కథకుల హక్కుకు భంగం కలిగిస్తున్నారు మీరు," అరిచాడు కథకుడు మైక్ బ్రద్దలయ్యేలా.

"హక్కూ గిక్కూ అన్నావా డొక్క చించుతాం జాగ్రత్త....ఊ కానీయ్ మిగిలిన కథ...." శ్రోతల్లో కలవరం రేగింది.

కథకునికి ఏమీ తోచలా. శ్రోత లందరి వైపూ చూచాడు. తను ఏమన్నా తన్నేట్లున్నారు వాళ్లు. చెప్పక తప్పదురా భగవంతుడా అనుకున్నాడు. మళ్లీ ఒక్కసారి ఆవులించి, కథ ప్రారంభించాడు.

* * *

కూతురు ఏమైందో అనే గాభరాతో, పోలీసులకు రిపోర్టిద్దామని భద్రంగారు ఇంట్లోనుండి బయటకు రావటం, వాకిట్లో కారాగటం రెండూ ఒకేసారి జరిగాయి. ఈ వేళప్పుడు (?) ఆ సమయంలో కారు మీద వచ్చేవాళ్లెవరా అని, భద్రంగారు అనుకుంటూవుండగానే, కార్లోనుండి చిలకా గోరింకల్లా 'సీతారాముడు' దిగారు. సీతను చూడగానే భద్రంగారి హృదయం తేలిక పడింది. వాకిట్లో నిలబడిన తండ్రిని చూసి సీత గబగబా గడప దాటి లోపలికి వెళ్ళిపోయింది.

"ఏరా రాముడూ, ఏమిటిది! ఎక్కడ్నుంచి రావటం? సీతెక్కడ కన్పించింది," ప్రశ్నమీద ప్రశ్న కురిపించాడు భద్రంగారు.

"లోపలికి వెళ్ళి మాట్లాడుదాం రండి మామయ్యా," అంటూ ప్రశ్నలకు ఒకే సమాధానం చెప్పి లోపలికి దారితీశాడు రాముడు.

"వచ్చావమ్మాతల్లీ, ఎక్కడికి వెళ్లావో, ఏమైపోయావో అని గుండె పీచుపీచుమంది. పరీక్షకువెళ్ళక ఎక్కడికి వెళ్లావమ్మా," అంటూనే అమాంతంగా గుండెకు హత్తుకుంది కూతుర్ని, అన్నపూర్ణమ్మగారు; ఆమెకళ్లు ఆనందంతో తళతళ మెరిశాయి.

"ఇడిగోనే రాముడు, వాళ్లిద్దరూ కలిసి కార్లో వచ్చారు," గడప దాటుతూనే అన్నాడు భద్రంగారు.

"ఏరా, రాముడూ...ఊళ్లోవుండేకన్పించటం మానేశావేరా," అంది అన్నపూర్ణమ్మగారు ఎంతో ఆప్యాయంతో.

"పరీక్షలుగాదటే...మా నాయన... రారానాయనా రా...సీతనువెదకి తెచ్చావా! నీభార్యను నీవు తెచ్చుకున్నావన్నమాట... కూర్చో," అంది ముసలమ్మ; కూతురుకొడుకంటే ఆమెకు వల్లమాలిన అనురాగం.

"ఏమ్మాసీతా, ఎక్కడికెళ్లావమ్మా. అంతా గాభరాపడిపోయాం. పరీక్షకు వెళ్ళ లేదటగా," లాలనగా అన్నాడు భద్రంగారు.

సీత రాముడివైపు చూసింది. రాముడు సీతవైపు చూశాడు. ఇద్దరిచూపులూ కలుసుకున్నాయి. సిగ్గుతో సీత తల దించుకుంది.

ఎవరూ మాట్లాడేమద్రా...మూగనోము పట్టారేంటి ? అసలు ఏంజరిగిందిరా రాముడూ," అడిగింది అన్నపూర్ణమ్మగారు.

నీవు చెప్పు అన్నట్టు చూశాడు సీతవైపు రాముడు.

నేను చెప్పలేనబ్బా, నాకు సిగ్గుఅన్నట్లు కళ్లు తిప్పింది సీత.

"చెప్పవేరారాముడూ," కళ్లు పెద్దవిచేసి చూశాడు భద్రంగారు. ఎలాగా చెప్పటం అని తికమకలుపడుతూ రాముడు గొంతు సవరించుకొంటుండగా లక్ష్మణుడు ప్రవేశించాడు.

అందరికళ్ళూ లక్ష్మణుడివైపు మళ్లాయి; బ్రతికానురా భగవంతుడా అనుకున్నాడు రాముడు.

"ఏరోయ్ లక్ష్మణుడూ, దారితప్పి వచ్చావే ... రా, రా, కూర్చో," ఆహ్వానించింది అన్నపూర్ణమ్మగారు.

"ఏంలేదుఅత్తయ్యా పరీక్షలకదూ తీరిక లేకుండావుంది, ఇటువెళ్తూ రాముడేమైనా ఇక్కడ వున్నాడేమో అని వచ్చాను," అన్నాడు లక్ష్మణుడు, భద్రంగారి ప్రక్క కుర్చీలో కూర్చుంటూ.

"ఇక చెప్పరా చప్పున," అన్నాడు భద్రంగారు రాముడుతో. రాముడు లక్ష్మణుడివైపు చూశాడు. లక్ష్మణుడు ఓ చిరునవ్వు విసిరేశాడు.

"నేనూ ఇవాళ పరీక్షకు వెళ్లలేదు మామయ్యా," ప్రారంభించాడు రాముడు, కూడగట్టుకున్న ధైర్యంతో.

"నీవూ వెళ్లక! అదీ వెళ్లక !....ఏమిటి వంతా," ఆశ్చర్యంగా అడిగాడు భద్రంగారు.

"అదంతా నేను చెప్పుతాలే విను మామయ్యా, రాముడికేమో పరీక్ష ప్యాసవుతాననే ధైర్యం లేకపోయింది. సీత ప్యాసైతే..." లక్ష్మణుడు చెప్తున్నది పూర్తవకుండానే, "అది పరీక్షకు వెళ్లలేదోయ్, ఇంకేం ప్యాసవుతుంది," అంటూ బ్రేక్ వేశాడు భద్రంగారు.

"అదేనండి నేను చెప్పబోతున్నది. సీత పరీక్షకు వెళ్లి ప్యాసైతే తన కిచ్చి చేయరనే భయంతో..."

"భయంతో ఏం చేశాడేంటి?" హుంకరించాడు భద్రంగారు.

"ఏం చేశాడులే, సీత వెళ్ళేదార్లో కాసి, కార్లో ఎక్కించుకొని, పరీక్ష ఒక పక్క జరుగుతుంటే మరోపక్క ఊరంతా షికార్లు కొట్టివచ్చాడు..." తన బాధ్యత తీరిందన్నట్లు రాముడివైపుచూసి తృప్తిగా నవ్వాడు లక్ష్మణుడు.

అన్నపూర్ణమ్మగారు అమాయకంగా నవ్వింది కూతురు తల నిమురుతూ; సీత సిగ్గుతో తల్లి హృదయంలో ముఖం దాచుకొంది; ముసలమ్మ ముక్కుమీద వేలేసుకొంది, ఎంత పని జరిగింది అనుకుంటూ.

భద్రంగారు ఉగ్రుడయ్యాడు. "ఎంత పని చేశావురా రాముడూ, నీవు చెడింది కాకుండా, దాన్నిగూడా చెడగొట్టావ్," అంటూ రంకెలు వేశాడు. అందరూ హడలిపోయారు. సీత గడగడలాడింది.

"ఏం చేసేది మామయ్యా, మరి నేను తప్పి అది ఫ్యాసైతే మా ఇద్దరి పెళ్ళికి నీవు ఒప్పుకునేవాడివేనా చెప్పు," నత్తి నత్తిగా, దీనంగా అన్నాడు రాముడు.

రాముడి ముఖాన్నొకసారి, సీత నోసారి ఎగాదిగా చూసి, "ఉండు నీపని చెప్తా నం"టూ చకచకా లోపలికిపోయి, కాగితం కలం తెచ్చి లక్ష్మణుడి కిస్తూ, "వాళ్ళ నాన్నకు ఉత్తరం రాయరా," అన్నాడు భద్రంగారు సీరియస్‌గా. వణుకుతున్న చేతుల్తో కాగితం కలం అందుకొని, "ఏమి వ్రాయటం," అన్నట్లు చూశాడు లక్ష్మణుడు; ఏమి వ్రాయిస్తాడో అని మనస్సులో శాపనార్థాలు పెట్టూ. ఏం రాస్తాగో, ఏమా తుందో అని అందరికీ దిగులు పట్టుకొంది.

"మహారాజశ్రీ బావగారికి—

ఉభయకుశలోపరి. చిరంజీవి మా రాముడు..." అని ఆగి రాముణ్ని కొద్ది క్షణాలు తీక్షణంగా చూసి, మీ రాముడికి త్వరగా వివాహం చేయటం ఎంతో అవసర మని, వాని ప్రవర్తన చెప్తున్నది. అందుచేత మాచిరంజీవి సౌభాగ్యవతి సీతను మీవాడి కివ్వటానికి నిర్ణయించుకున్నాను. మీకు చెప్పవలసిందేముంది. అంతా మీకు తెలి సింగేనాయె. ఈ జాబు అందిన తక్షణం మీరు యావన్మంది బంధుమిత్ర సమేతంగా వచ్చి 'సీతా రాముల' వివాహానికి శుభ ముహూర్తాన్ని నిశ్చయించవలసింది..." అంటూ ముగించి, పకపకా నవ్వాడు భద్రంగారు. అందరూ 'హమ్మయ్య' అను కున్నారు.

సీత రాముడువైపు చిలిపిగా చూసింది.

"చూశావుగా నా ప్రతాపం" అన్నట్లు రాముడు సీతవైపు చూశాడు.

ఇద్దరి కళ్లు కిలకిలా నవ్వాయి; ఇదంతా చూస్తున్న అన్నపూర్ణమ్మగారు కూతురు బుగ్గలు పుణికింది సంతోషంతో. అంతా ఓకంట కనిపెట్టున్న భద్రంగారు భార్య వైపు చూశాడు, తన పెళ్ళిని గుర్తుకు తెచ్చుకోవటానికి ప్రయత్నిస్తూ.

"ఇంత పనీ నేనేగదా చేయించింది"అని మనస్సులో హాయిగా నవ్వుకున్నాడు లక్ష్మణుడు.

"మా నాయనే, మా బాబే" అంటూ రాముడి ప్రక్కన చేరి వీపు నిమురుతూ మురిసిపోయింది ముసలమ్మ.

కథ కంచికి...మనం ఇంటికి...

* * *

భలే భలే అనుకుంటూ శ్రోతలంతా లేచారు.

"తర్వాత ఏమైం దేంటి?" లేస్తున్న శ్రోతల్లో ఒకరు అడిగారు.

"ఏమైందా......కళ్యాణం," మరో శ్రోత జవాబిచ్చాడు.

"పరీక్షపోతే పోయింది గాని పెళ్ళయింది భలే. ఇంతకూ ఆ తెలివంతా రాముడి దంటావా, లక్ష్మణుడి దంటావా?" అని ఎవరో మరొకరు అడిగారు.

"ఎవరిదైతేనేం, రాముడుమాత్రం భలేపని చేశాడు," అని సమాధానం వచ్చిందేగాని, ఆ తెలివి కథకుడిదని ఏ ఒక్కరూ అన్న పుణ్యాన పోలేదు. ★



పిల్లలకు వాడవచ్చును...
పెద్దవారికి వాడవచ్చును...
వృద్ధులకు కూడా వాడవచ్చును.
పెర్టుసిన్ అన్ని విధములగు దగ్గులను, తత్సంబంధమగు వ్యాధులను త్వరితముగాను, క్షేమము గాను నివారించును, పెర్టుసిన్ కొనుడు!

Infa

అందరు కెమిస్టుల వద్దను లభించును

ఎస్ఫా లిమిటెడ్, షాన్ లిక్టెన్‌స్టైయిన్, స్విస్ కస్టమ్ అండ్ ఎకనామిక్ టెర్రిటరీ వారితో చేసుకున్న ఒడంబడిక ప్రకారము, యిండియాలో ఇన్ఫా లిమిటెడ్, పోస్టు ఆఫీసు బాక్సు నెం. 1041, బొంబాయి-1 వారిచే తయారయినది.